


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :113 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 18-08-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## కల్తీ రాయుళ్లకు క్యూరా.. రేవంత్ మార్క్ టీజీ-సేఫ్ డోసు!

హైదరాబాద్,కల్తీ ఆహారం తిని కడుపు నొప్పి తెచ్చుకోవడం.. ఆ నొప్పి తగ్గడానికి వేసుకునే మందు కూడా నకిలీదే అయి దేవుడి దయ మీద ఆధారపడటం.. ఇదీ మన హైదరాబాద్‌లో ఇటీవల సాగుతున్న అసలైన 'లైఫ్‌స్టైల్'.. పానీపూరీలో కెమికల్స్, బిరియానీలో రంగులు, మెడికల్ షాపుల్లో ఏవో వింత ఔషధాలు.. ఇలా ప్రతీ దాంట్లోనూ కల్తీ మహారాజులు తమ మార్క్ చూపిస్తున్నారు. అయితే ఈ 'కల్తీ లీలల'కి చెక్ పెట్టేందుకు రేవంత్ సర్కార్ ఒక మాంచి ప్లాన్ వేసింది. అదే టీజీ–సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్). స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం గారు ఇచ్చిన ఈ అనౌన్స్‌మెంట్‌తో కల్తీ బాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుండాలి.ఇప్పటిదాకా ఫుడ్ సేఫ్టీ వాళ్లు ఒకవైపు, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) వాళ్లు ఇంకోవైపు.. ఎవరి దారి వారిదే అన్నట్లు తనిఖీలు చేసేవారు. ఒకరు ఆహారాన్ని పట్టుకుంటే.. ఇంకొకరు నకిలీ టాబ్లెట్లను పట్టుకునేవారు. కానీ ఇప్పుడు ఈ రెండింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి 'TG-SAFE తయారు చేశారు. అంటే ఇకపై కల్తీ రాయుళ్లకు రెట్టింపు ట్రీట్‌మెంట్ లభించబోతోందన్నమాట.. అయితే ఈ రెండింటి చట్టపరమైన అధికారాలు మాత్రం దేనికవే ఉంటాయట. కేవలం సమన్వయం కోసం మాత్రమే ఈ విలీనం అని స్పష్టం చేశారు.ఈ కొత్త వ్యవస్థకు నాయకుడిగా 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అవినాష్ మొహంతిని నియమించారు. ఆల్రెడీ డీసీఏ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఆయనకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలు ఇచ్చేశారు. అంటే సింగిల్ విండో సిస్టమ్‌లా ఒకే పోలీస్ బాస్ ఇటు ఆహారాన్ని, అటు ఔషధాలను పర్యవేక్షిస్తారన్నమాట.ఈ టీజీ సేఫ్ లో డ్రగ్



కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్, ల్యాబ్‌లు, అడ్మినిస్ట్రేషన్ అని మొత్తం ఆరు విభాగాలు ఉంటాయి. ముందుగా ఈ ప్రయోగాన్ని ఎక్కువ హోటళ్లు, ఫార్మా కంపెనీలు ఉన్న 'క్యూర్' ప్రాంతంలో మొదలుపెడతారట. అక్కడి ఫలితాలు చూశాక రాష్ట్రమంతా విస్తరిస్తారు.ప్రభుత్వం ఆలోచనైతే చాలా బాగుంది. తనిఖీలు వేగవంతం అవ్వడం, ఇంటెలిజెన్స్ సమాచారం పంచుకోవడం వల్ల నాసిరకం ఉత్పత్తులు త్వరగా బయటపడతాయని భావిస్తున్నారు. అయితే ఈ కొత్త 'టీజీ సేఫ్' దెబ్బకు కల్తీ రాయుళ్లు తమ దుకాణాలు సర్దేస్తారా లేక ఈ అథారిటీని కూడా ఎలా దాటాలో కొత్త రూట్ కనుక్కుంటారా అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ప్రజారోగ్యంతో ఆటలాడేవారికి రేవంత్ సర్కార్ వేసిన ఈ బిగ్ స్టెప్ ఎలాంటి 'సేఫ్' ల్యాండింగ్ ఇస్తుందో చూడాలి.

## తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?

న్యూఢిల్లీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షల్లో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు.ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎక్స్‌ట్రాక్షన్ మెషీన్..

పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు.

ప్రశ్నపత్రాలు ముందే లీకయ్యాయా?



యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారాయన.

ఎన్‌టీఏపై చర్యలకు రాహుల్ గాంధీ డిమాండ్..

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నిస్తూనే ఉంటా: రాహుల్ గాంధీ

'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

## అయోధ్య కేసులో స్టేటస్ రిపోర్టు ఇవ్వండి: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన కేసులో ఇవాళ సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. వీలైనంత త్వరగా దర్యాప్తును పూర్తి చేయాలని సిట్‌ను సుప్రీం ఆదేశించింది. ఈ కేసులో ఏవైనా సూచనలను చేస్తే, వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించాలని SITని సుప్రీంకోర్టు కోరింది. దర్యాప్తులో గుణాత్మక విశ్లేషణ కోసం మాత్రం చేసే సూచనలను సిట్ పరిగణలోకి తీసుకోవాలని కోర్టు చెప్పింది. రామాలయ విరాళాల చోరీ కేసులో దర్యాప్తునకు చెందిన స్టేటస్ నివేదిక ఇవ్వాలని సిట్‌ను సుప్రీం ఆదేశించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది.విరాళాల చోరీ కేసులో దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో పెట్టి ఇవ్వాలని సుప్రీం కోరింది. దర్యాప్తులో గుణాత్మక మెరుగుదల, పారదర్శకత కోసం వివిధ వాజ్యందారులు చేసే సూచనలను సిట్ పరిగణలోకి తీసుకోవాలని కోర్టు పేర్కొన్నది. అయితే సిట్ నివేదికను పరిశీలించిన తర్వాతే..

## నేను కూడా జీవన్ రెడ్డిలా తిరగబడతా...



హైదరాబాద్,బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలో ఉండి అన్నీ సంపాదించుకుని కాంగ్రెస్ లోకి వచ్చిన వాళ్లకే టికెట్ ఇచ్చారని, డబ్బులకు ఆశపడి నాకు ఇవ్వకుండా వేరే వాళ్లకి టికెట్ ఇచ్చారని..పార్టీలో ఇన్ని తప్పులు చేస్తున్నా భరిస్తూ వస్తున్నాం అని, ఒకవేళ నేను భరించకపోతే ఇంకో జీవన్ రెడ్డి అయ్యేవాడినని మాజీ ఎమ్మెల్యే, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కీలక వాఖ్యలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జీవన్ రెడ్డిలా తానూ తిరగబడతానని వార్నింగ్ ఇచ్చారు.వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి తాజాగా మరోసారి విమర్శలు గుప్పించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుక్కున్నాడని ఆరోపించారు. సోనియాగాంధీ టికెట్ నాకే ఇవ్వాలని అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి, ఆయన వద్ద డబ్బులు లేకపోతే మీరే ఖర్చు పెట్టుకోవాలని చెప్పారని, అయినా పార్టీలోని ఎన్నికల కమిటీ డబ్బులకు ఆశపడి నాకు టికెట్ ఇవ్వలేదని చిన్నారెడ్డి అన్నారు. మేఘారెడ్డి దగ్గర డబ్బులు తీసుకుని టికెట్ అతనికి ఇచ్చారని,40ఏళ్లుగా నిర్మించుకున్న నా రాజకీయ జీవితాన్ని ఒక్క వేటుతో కూల్చేశారని, నన్ను దెబ్బతీయడంతో పాటు వనపర్తి నియోజవర్గాన్ని కూడా దెబ్బతీశారని విమర్శించారు. ఇవాళ నేను ఎమ్మెల్యేని,మంత్రిని అయ్యి ఉంటే వనపర్తికి మహర్దశ వచ్చేది అన్నారు.ఇప్పు డు నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల కాంట్రాక్టులు ఎమ్మెల్యే వర్గీయులకు రాలేదని, పనులు అన్నీ ఆపేస్తున్నాడని,నా అనుచరులను బాగా ఇబ్బంది పెడుతు న్నాడని చిన్నారెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కూడా మేఘారెడ్డి అడ్డు పడుతున్నాడని మంత్రులే చెప్పారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. నేను జీవన్ రెడ్డిలా తిరగబడే సమయం వచ్చింది అన్నారు.కానీ నేను పార్టీ నుండి వెళ్లబోనని, మేఘారెడ్డి లాంటి తప్పుడు గాళ్లను పార్టీ నుండి తరిమేస్తానని అన్నారు.

## విద్యార్థులు,పరిశ్రమలను కలిపే జాబ్ పోర్టల్.. దేశంలోనే తొలిసారి

మెదక్, ఆగస్టు 17: దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. (సోమవారం) జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు.



వారి కోసం రూ.25 లక్షల జీతం ఎదురుచూస్తోందని తెలిపారు. వీసా ఖర్చులను కూడా సగం వరకూ ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. విదేశాలకు వెళ్తే ఎన్నో కుటుంబాలు బాగుపడతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభంపై మాజీ మంత్రి విమర్శలు..



హైదరాబాద్,సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ప్రారంభం నేపథ్యంలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. టిమ్స్ ఆలోచన, ప్రణాళిక, నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అయితే ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని విమర్శించారు.

"ఆలోచన కేసీఆర్‌ది.. ప్రచారం కాంగ్రెస్‌ది"

కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించి ప్రచారం చేసుకున్నట్లుగానే, కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రారంభ తేదీలు పలుమార్లు మారినా, ఆసుపత్రుల్లో పూర్తి స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాకపోవడం విచారకరమని అన్నారు. రూ.వెయ్యి కోట్లతో నిర్మించిన ఆసుపత్రిని కేవలం ఓపీ సేవలకు మాత్రమే పరిమితం చేయడం సరైన విధానం కాదని విమర్శించారు.

మూడు టిమ్స్‌లకు రూ.2,679 కోట్ల మంజూరు

హైదరాబాద్ నగరానికి మూడు వైపులా అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్‌లో టిమ్స్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని హరీశ్‌రావు తెలిపారు. కరోనా అనంతర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో టిమ్స్‌లకు రూపకల్పన చేశామని పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులకు శంకుస్థాపనలు చేశామని, ఒక్కో ఆసుపత్రిని వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మించేందుకు రూ.2,679 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

నిర్మాణాల్లో జాప్యంపై విమర్శలు

## జాబ్ క్యాలెండర్,నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయి



హైదరాబాద్,నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు తమను నమ్మాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలా కోరుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు 30 నెలలు గడిచినా ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని ఆమె విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు 16 వేలని ముఖ్యమంత్రి స్వయంగా వెల్లడించారని పేర్కొంటూ.. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగులు ప్రభుత్వాన్ని ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

ఉద్యోగాల కోసం రోడ్డెక్కితే అణచివేతా?

ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి పోలీసులను పెట్టి అణచివేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. నిరుద్యోగులు, విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.

పోలీసు శాఖలో ఖాళీలపై ప్రశ్నలు

పోలీసు శాఖలో 20 వేలకు పైగా ఖాళీలు ఉన్నప్పటికీ కేవలం 7,437 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని నాలుగు పోలీసు కమిషనరేట్లకు ఒక్క కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఆయా ప్రాంతాల నిరుద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖాళీల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలోనూ భారీ ఖాళీలు

విద్యాశాఖలో 20 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా వెంటనే భర్తీ చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు కోరుతున్నారని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న యువత పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిరుద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలు, ప్రత్యారోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం మానుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

పోలీసు శాఖలోని మొత్తం ఖాళీలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని, విద్యాశాఖలోని 20 వేలకు పైగా ఖాళీలను కూడా భర్తీ చేయాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. "విద్యార్థులు, నిరుద్యోగుల గురించి నిజంగా ప్రభుత్వం ఆలోచిస్తే.. ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ గుర్తించి, భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి" అని ఆమె పేర్కొన్నారు. జఖ=జు పరిధిలోని జిల్లాలకు పోలీసు ఉద్యోగాల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని ఎలా సరిచేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## సంపాదకీయం

**మంగళవారం 18-08-2026**

# చైనా, పాకిస్తాన్, అమెరికా కు ఇచ్చి పడేసిన మోడీ

ఢిల్లీలోని ఎర్రకోట.. 150 సంవత్సరాల వందేమాతర గీతం.. వేలాదిమంది యువకులు.. విశిష్ట అతిథులు.. సర్వసత్తాక సైన్యం.. ఇందరి మధ్యలో నరేంద్ర మోడీ.. దగదగ మెరిసిపోతున్న ఎర్రకోట మీద.. మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. జాతీయ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం.. అంతకంటే ముందు వందేమాతరం గీతాన్ని ఆలపించడం.. ఈ క్రతువులు ముగిసిన తర్వాత నరేంద్ర మోడీ తన అసలు సిసలైన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం.. అంతకంటే ముందు వందేమాతరం గీతాన్ని ఆలపించడం.. ఈ క్రతువులు ముగిసిన తర్వాత నరేంద్ర మోడీ తన అసలు సిసలైన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ఒక ముక్కలో చెప్పాలంటే ఇటీవల కాలంలో నరేంద్ర మోడీ ఇంత ఉద్వేగంగా ఎన్నడు మాట్లాడలేదు. దాదాపు ఆయన ప్రసంగం గంట పాటు సాగింది.. స్వాతంత్ర్య సమరయోధులను కొనియాడుతూ.. దేశం సాగించిన అభివృద్ధిని చెబుతూ.. సాధించాల్సిన లక్ష్యాల గురించి వివరిస్తూ.. ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఏ కరువు పెడుతూ.. దూసుకువస్తున్న వ్యతిరేక శక్తుల గురించి హెచ్చరికలు చేస్తూ.. సాగిపోయింది నరేంద్ర మోడీ ప్రసంగం. అప్పట్లో అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజున నరేంద్ర మోడీ ఏ విధంగానైతే మాట్లాడారో.. స్వాతంత్ర వేడుకల సందర్భంగా అదే స్థాయిలో తన ప్రసంగాన్ని చేశారు ప్రధాని. భారతదేశానికి పక్కలో బల్లెం లాగా చైనా.. అమెరికా తయారయ్యాయి. భారత్ తన తయారీ రంగాన్ని విస్తృతం చేస్తున్న నేపథ్యంలో ఆ రెండు దేశాలు ఇబ్బంది పెడుతున్నాయి. దేశంలో అంతర్గత కలహాలను సృష్టించడానికి కుట్రలు చేస్తున్నాయి. ఇటీవల కాలంలో జరిగిన నీట్ ఉద్యమం దీనికి ఒక బలమైన ఉదాహరణ. దీని లోతుల్లోకి వెళ్లిన కేంద్ర దర్యాప్తు బృందాలు.. ప్రభుత్వానికి స్పష్టమైన సూచనలు చేశాయి. అప్పటినుంచి నరేంద్ర మోడీ తన సోషల్ మీడియా ఖాతాలో వీడియోలు చేయడం మొదలుపెట్టారు. జనరేషన్ జెడ్ ను ఆకట్టుకోవడం ప్రారంభించారు. అక్కడితోనే ఆగిపోలేదు.. స్వాతంత్ర్య వేడుకలలో జనరేషన్ జెడ్ కి సింహభాగం కేటాయించారు నరేంద్ర మోడీఎర్రకోట మీద నుంచి ఏకకాలంలో నరేంద్ర మోడీ చైనాకు.. పాకిస్తాన్ కు.. అమెరికాకు గట్టిగా హెచ్చరికలు పంపించారు.. 20047 నాటికి వికసిత్ భారత సాధ్యమవుతుందని ప్రకటించారు. భవిష్యత్తు కాలంలో పూర్తిస్థాయిలో సెమీ కండక్టర్ల ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశాన్ని ఎదిగే విధంగా చేస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్గా భారత్ ఉందని.. అది మన దేశానికి అత్యంత గర్వకారణం అని నరేంద్ర మోడీ ప్రకటించారు. అందువల్లే ప్రపంచం మొత్తం ఇండియా వైపు చూస్తోందని అన్నారు. తయారీ రంగాన్ని బలోపేతం చేసిన నేపథ్యంలో భారతదేశం ఇకపై ఏ దేశాల మీద ఆధారపడకూడదని.. ఆధారపడే అవకాశం లేదని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఎందరో వీరుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమని.. ప్రతి హృదయం జాతీయ గేయం ఆలపించడంతో మారుమోగుతోందని.. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందని.. దేశం సరికొత్త సంకల్పంతో ముందుకు వెళుతుందని.. మన సంకల్పం.. మన కలలు సాకారం అవుతున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేశామని.. భారతదేశం దాన్ని కచ్చితంగా అందుకుంటుందని నరేంద్ర మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని శక్తులు భారతదేశన్ని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని.. అయినప్పటికీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగుతామని నరేంద్ర మోడీ ప్రకటించారు. దేశ ఆర్థిక ప్రగతిని వివరిస్తూ.. “ఒకప్పుడు మనల్ని ‘ఫ్రాజైల్ ఫైవ్’ (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) దేశాల్లో ఒకటిగా లెక్కించేవారు. కానీ, కేవలం 12 ఏళ్లలోనే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. గడిచిన 12 ఏళ్లుగా ప్రతి ఒక్కరూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి కృషి చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం భారత్ పెద్ద కలలే కన్నది, కానీ ఆశించిన వేగంతో ప్రగతి సాధించలేకపోయాం. ఈ రోజు భారత్ అపూర్వమైన వేగం, ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళతోంది. ఇప్పుడు 140 కోట్ల భారతీయుల సంకల్పాన్ని ఏ శక్తీ ఆపలేదు” అని మోడీ ఉద్ఘాటించారు. భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడుతూ.. “మన కలలు, సంకల్పాలు పెద్దవిగా ఉండాలి. అప్పుడే మన సామర్థ్యాలు ఉన్నత శిఖరాలకు చేరుతాయి. భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహించడానికి పెద్ద కలలు కంటోంది. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందేలా నేను చూస్తాను. అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు, ప్రపంచం మనల్ని కచ్చితంగా భిన్నంగా చూస్తుంది” అని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల నష్టపోయిన కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని, వారికి యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. మరో వైపు భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక చారిత్రక, అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ చరిత్రలో తొలిసారిగా ఎర్రకోటపై జరిగిన అధికారిక వేడుకల్లో జాతీయ గేయం ‘వందేమాతరం’ పూర్తి గీతాన్ని ఆలపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో, ఆర్మీ బ్యాండ్ వందేమాతరం గీతాన్ని వాయించగా, ఆ తర్వాత యథావిధిగా జాతీయ గీతం ‘జన గణ మన’ను ఆలపించారు. ఈ ఏడాది జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తి కావడం ఈ సందర్భానికి మరింత ప్రాధాన్యాన్ని చేకూర్చింది.


# ‘ఉపాధి’ ఉసూరుమంటోంది!

న్యూఢిల్లీ,జులైలో విబి జిరామ్ జి కింద 7.67కోట్ల వ్యక్తి- పని దినాలు.. గత ఏడాది ఎంజిఎన్ఆర్ఇజిలో 15.33 కోట్లు; ఉపాధి పొందిన కుటుంబాలు 51% తగ్గుదల కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్- గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ విబి జిరామ్ జి పథకం అమల్లోకి వచ్చిన తొలి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పనలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. దీంతో కొత్త ఉపాధి హామీ పథకం అమలు, అందుబాటుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2026 జులైలో ఈ పథకం కింద 7.67కోట్ల వ్యక్తి-పని దినాలు మాత్రమే నమోదయ్యాయి. 2025 జులైలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఇజి కింద నమోదైన 15.33కోట్ల వ్యక్తి-పని దినాలతో పోలిస్తే ఇది దాదాపు 50% తక్కువ. ఉపాధి పొందిన గ్రామీణ కుటుంబాల సంఖ్య కూడా 1.42కోట్ల నుంచి 68.94లక్షలకు తగ్గి, 51.45% క్షీణించింది. 2026 జులై 1 నుంచి విబి జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఇజి స్థానంలో అమల్లోకి వచ్చింది. ఈ పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజులకు బదులుగా 125రోజుల ఉపాధి హామీ కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఉపాధి తగ్గడానికి ఎంజిఎన్ఆర్ఇజి నుంచి కొత్త విధానానికి మార్పు, వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే కాలంలో ఉపాధి కల్పనకు విరామం, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలనుంచి వలస కార్మికుల సంఖ్య తగ్గడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. కొత్త విధానం ప్రకారం, విత్తనాలు వేయడం, పంట కోత వంటి కీలక వ్యవసాయ కాలాల్లో 60రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం రాష్ట్రాలకు ఉంది. దీంతో వ్యవసాయ పనులకు కార్మికులు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది. ఎంజిఎన్ఆర్ఇజిలో ఇలాంటి నిబంధన లేదు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాత్రం కొత్త విధానంలోకి మార్పు సజావుగానే జరిగిందని చెబుతోంది. ఉపాధి కోరిన గ్రామీణ కుటుంబాల్లో 98 శాతానికి పైగా కుటుంబాలకు పని కల్పించినట్లు పేర్కొంది. జులైలో వాస్తవ ఉపాధి కల్పన సుమారు 9కోట్ల వ్యక్తి-పని దినాలుగా ఉందని కూడా అంచనా వేసింది. అయితే, కాలానుగుణ పరిమితులు, సాంకేతిక నిబంధనలు, పాత పథకం నుంచి కొత్త పథకానికి మారే క్రమంలో ఏర్పడిన సమస్యలు ఉపాధి గణాంకాల భారీ తగ్గుదలకు కారణమై ఉండవచ్చని విమర్శకులు అంటున్నారు. విబి జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఇజిలోని డిమాండ్ ఆధారిత విధానం నుంచి మరింత నియంత్రిత, సరఫరా ఆధారిత విధానానికి మార్పును సూచిస్తోందని కార్మిక సంఘాలు, విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ పనులు జరిగే కాలంలో ఉపాధిపై పరిమితులు విధించడం వల్ల ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. అలాగే డిజిటల్ ధ్రువీకరణ, సాంకేతిక ఆధారిత అమలుపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ కార్మికులకు ఈ నిబంధనలు సమస్యగా మారవచ్చని విమర్శకులు పేర్కొంటున్నారు. విబి జిరామ్ జిలో ప్రధాన మార్పుల్లో ఒకటి వార్షిక ఉపాధి హామీని 100 నుంచి 125 రోజులకు పెంచడం. అయితే, గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్థాయి సంఘం చేసిన సిఫార్సు కంటే ఇది తక్కువ. 2025 మార్చి 12న సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, ప్రతి కుటుంబానికి హామీ ఇచ్చే ఉపాధి దినాలను 100 నుంచి కనీసం 150 రోజులకు పెంచాలని సిఫార్సు చేసింది. గ్రామీణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఎంజిఎన్ఆర్ఇజిను సమగ్రంగా సమీక్షించడంతో పాటు, పనుల స్వభావాన్ని విస్తరించాలని కూడా కమిటీ సూచించింది. కొత్త విధానంలో నైపుణ్యం లేని కూలీలకు ఏకరీతి వేతన రేటును నిర్ణయించే అవకాశం ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను క్రమం తప్పకుండా సవరించే స్పష్టమైన విధానం లేదని విమర్శకులు అంటున్నారు. ధరలు పెరుగుతున్న సమయంలో



వేతనాలకు తగిన సూచీ ఆధారిత సవరణలు లేకపోతే గ్రామీణ కార్మికుల వాస్తవ ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇది పేద కుటుంబాలకు సామాజిక భద్రతా వలయంగా ఉండాల్సిన పథకం ప్రభావాన్ని బలహీనపరచవచ్చని అభిప్రాయపడుతున్నారు. విబి జిరామ్ జిలో కేంద్ర- రాష్ట్రాల మధ్య నిధుల భాగస్వామ్య విధానంలో కూడా మార్పు వచ్చింది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం 90% వ్యయాన్ని భరిస్తుంది. ఇతర రాష్ట్రాలు, శాసనసభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాల్లో 60:40 నిష్పత్తిలో కేంద్రం- రాష్ట్రాలు వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది. ఫిస్కల్ మెమొరాండం ప్రకారం, వేతనాలు, మెటీరియల్, పరిపాలనా ఖర్చులతో కలిపి ఈ పథకం వార్షిక వ్యయం రూ. 1,51,282 కోట్లుగా అంచనా. ఇందులో కేంద్రం వాటా రూ. 95,692.31 కోట్లు కాగా, రాష్ట్రాలపై సుమారు రూ. 56,000 కోట్ల భారం పడనుంది. ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్న రాష్ట్రాలపై పెరిగిన వాటా అదనపు ఆర్థిక ఒత్తిడిని కలిగించవచ్చని విమర్శకులు అంటున్నారు. వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో గ్రామీణ ఉపాధి తగ్గడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలోని సుమారు సగం జిల్లాల్లో వర్షపాతం లోటుగా నమోదైందని, ఖరీఫ్ పంటల విస్తీర్ణం 26.50 శాతం తగ్గిందని అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. వ్యవసాయంలో అనిశ్చితి పెరిగినప్పుడు గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భద్రత అవసరం మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యక్తి-పని దినాల తగ్గుదల కొత్త పథకం గ్రామీణ కుటుంబాలకు తగిన ఆదాయ మద్దతు అందించగలదా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. మొత్తం ఉపాధి తగ్గినప్పటికీ, మహిళల భాగస్వామ్యం గణనీయంగా ఉంది. మొత్తం వ్యక్తి-పని దినాల్లో మహిళలు సుమారు 63 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన కనీసం మూడో వంతు కంటే చాలా ఎక్కువ. దీంతో మొత్తం ఉపాధి గణనీయంగా తగ్గినప్పటికీ, గ్రామీణ మహిళలకు ఈ పథకం ఇప్పటికీ ముఖ్యమైన ఉపాధి వనరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. విబి జిరామ్ జి తొలి నెల ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఒకవైపు ఉపాధి హామీని 100 నుంచి 125 రోజులకు పెంచింది, మహిళల భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉంది. మరోవైపు వ్యక్తి-పని దినాలు, ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్యలో భారీ తగ్గుదల పథకం అమలు, అందుబాటు, ప్రభావంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. జులైలో నమోదైన తగ్గుదల కేవలం కాలానుగుణ పరిస్థితులు, ఎంజిఎన్ఆర్ఇజి నుంచి కొత్త విధానానికి మార్పు కారణంగానే జరిగిందా? లేక కొత్త పథకంలో మరింత లోతైన నిర్మాణాత్మక సమస్యలు ఉన్నాయా? అన్నది రాబోయే నెలల్లో స్పష్టమవుతుంది. అంతిమంగా, కాగితాలపై ఎన్ని రోజుల ఉపాధికి హామీ ఇచ్చారన్నది కాదు.. గ్రామీణ కార్మికులు అవసరమైన సమయంలో ఉపాధిని కోరగలరా, పొందగలరా, సకాలంలో పని, వేతనాలు అందుకోగలరా అన్నదే విబి జిరామ్ జి విజయానికి అసలు కొలమానం.

# ఇక ‘స్మార్ట్’ కావలసింది పౌరసరఫరాల శాఖే!



హైదరాబాద్, పేదవాడి చేతిలోకి వస్తున్న కొత్త స్మార్ట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు కేవలం ప్లాస్టిక్ ముక్క కాదు.. అది ఆహార హక్కుకు, ఆత్మగౌరవానికి గుర్తు. ఆగస్టు 15 నుంచి కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. క్యూఆర్ కోడ్, వాటర్‌ప్రూఫ్ పివిసి, భద్రతా లక్షణాలతో కార్డును ఆధునికీకరించడం స్వాగతించాల్సిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా పేదవాడు ఎవరి ముందు చేయి చాచకుండా ఆకలి తీర్చుకునే హక్కుకు ఈ కార్డు ప్రతీక కావాలి. ముఖ్యమంత్రి మరో విషయాన్ని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించేవారని, ఇప్పుడు 48 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. నాణ్యమైన బియ్యం పేదల ఇంటి అవసరానికి చేరడం నిజంగా మార్పే అయితే స్వాగతించాలి. కానీ ఆ మార్పు ప్రతి అర్హత కుటుంబం గడప వరకు చేరుతోందా? అన్నదే అసలు పరీక్ష. కార్డుపై సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉండి ప్రధాని మోడీ ఫొటో లేకపోవడంపై బిజెపి ప్రశ్నిస్తోంది. కేంద్రం ఐదుకిలోల ఉచిత ఆహార ధాన్యం అందిస్తోందని, రాష్ట్రం అదనంగా సన్నబియ్యం ఇస్తోందని చెబుతున్నప్పుడు ప్రజలకు కావాల్సింది బొమ్మల గొడవ కాదు.. కేంద్రం ఎంత? రాష్ట్రం ఎంత? అన్న స్పష్టమైన లెక్క. భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా కార్డుపై పునరాలోచిస్తే వివాదానికి తెరపడుతుంది. డీలర్ కమిషన్ విషయంలోనూ ప్రభుత్వం తాజా లెక్కలు బయటపెట్టాలి. 2023లో టన్నుకు రూ. 1,400 కమిషన్ నిర్ణయించినప్పుడు కేంద్రం రూ. 450, రాష్ట్రం రూ. 950 భరించే విధానం ఉంది. ఇప్పుడు 2026. ప్రస్తుతం డీలర్‌కు ఎంత? కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం వాటా ఎంత? బకాయిలెంత? అన్నది పౌరసరఫరాల శాఖ స్పష్టం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో డీలర్లకు చెల్లిస్తున్న కమీషన్‌తో పోల్చి తెలంగాణ పరిస్థితినీ ప్రజల ముందుంచాలి. అసలు కనువిప్పు కలిగించాల్సిన సమస్య రేషన్ దుకాణం దగ్గరే ఉంది. వృద్ధుల వేలిముద్రలు పడక గంటల తరబడి మళ్లీ మళ్లీ ప్రయత్నించాల్సి వస్తోంది. వినియోగదారుడికీ, డీలర్‌కీ ఇబ్బందే. స్మార్ట్ కార్డు ఇచ్చి స్మార్ట్ సమస్యలు సృష్టించడం ఎందుకు? వేలిముద్ర విఫలమైతే ప్రతి రేషన్ దుకాణంలో ఐరిస్ స్కానింగ్ సౌకర్యం తప్పనిసరి చేయాలి. సాంకేతిక వైఫల్యం కారణంగా అర్హుడి రేషన్ ఆగకూడదు. ఇంకో మానవీయ ప్రశ్న ఉంది. ఇంటినుంచి బయటకు వెళ్లలేని వృద్ధ దంపతులు, మంచానికే పరిమితమైన వికలాంగులు, కుటుంబ సభ్యులు అందుబాటులో లేని ఒంటరి వృద్ధులు రేషన్ దుకాణానికి ఎలా వస్తారు? పింఛన్ గడపవద్దకు అందించే విధానం ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో రేషన్‌ను కూడా వారి గడప వద్దకే చేర్చే ప్రత్యేక వ్యవస్థ ఎందుకు ఉండకూడదు? అధీకృత ప్రతినిధి లేదా ప్రత్యేక మొబైల్ పంపిణీ ద్వారా సరఫరా చేయాలి. కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేకపోతే ప్రభుత్వం లేదా గ్రామస్థాయి యంత్రాంగం బాధ్యత తీసుకోవాలి. సంక్షేమాన్ని ప్రకటించడం ప్రభుత్వ విజయం కాదు.. అది అర్హుడైన చివరి లబ్ధిదారుడి గడప దాటి చేరినప్పుడే ప్రభుత్వ పనితీరు కొలవాలి. పౌరసరఫరాల శాఖ దగ్గర మరో లెక్క కూడా స్పష్టంగా ఉండాలి. రాష్ట్రంలో పాత కార్డులు ఎన్ని, కొత్తగా మంజూరైనవి ఎన్ని, తొలగించినవి ఎన్ని, పెండింగ్ దరఖాస్తులు ఎన్ని, కొత్త కార్డుల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఎన్ని అనే గణాంకాలను జిల్లాల వారీగా విడుదల చేయాలి. కార్డు ఇచ్చామని ప్రకటించడం ఒకటైతే, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు చేరడం మరోటి. సన్నబియ్యం పంపిణీపైనా ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలి. 48లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నప్పుడు నెలకు ఎంత ధాన్యం అవసరం? కొనుగోలు, మిల్లింగ్, రవాణా, నిల్వ, పంపిణీతో కలిపి ప్రభుత్వంపై పడే భారం ఎంత? కేంద్రం అందించే ఐదు కిలోల ధాన్యంతో రాష్ట్రం అందించే అదనపు కిలో ఎలా కలుస్తోంది? ఈ లెక్కలు బయటపెడితే పథకం విలువ మరింత స్పష్టమవుతుంది. రేషన్ వ్యవస్థలో మార్పు అంటే కార్డు రూపం మార్చడం మాత్రమే కాదు. అర్హత గుర్తింపు నుంచి ధాన్యం కొనుగోలు వరకు, గోదాము నుంచి డీలర్ దుకాణం వరకు, అక్కడి నుంచి లబ్ధిదారుడి గడప వరకు ప్రతి దశను పౌరసరఫరాల శాఖ పర్యవేక్షించాలి. నెలవారీగా, జిల్లాల వారీగా పంపిణీ, మిగులు, తిరస్కరణలు, బయోమెట్రిక్ విఫలతలు, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలకు డ్యాష్‌బోర్డు తరహాలో వివరాలు అందుబాటులో ఉంచాలి. అప్పుడు బొమ్మలపై జరిగే రాజకీయ వివాదాలకంటే సేవలపై ప్రజల తీర్పే ముఖ్యమవుతుంది. రేషన్ దుకాణంలో వృద్ధులకు ప్రత్యేక క్యూలు, వికలాంగులకు ప్రాధాన్యత, యంత్రం పనిచేయని రోజుల్లో ప్రత్యామ్నాయ ధ్రువీకరణ వంటి ఏర్పాట్లు కూడా తప్పనిసరి కావాలి. డీలర్‌ను కూడా సమస్యల మధ్య ఒంటరిగా వదిలేయకూడదు. వేలిముద్రలు పడకపోయినా, నెట్‌వర్క్ పనిచేయకపోయినా, యంత్రం మొరాయించినా వినియోగదారుడి ఆగ్రహాన్ని డీలరే ఎదుర్కొంటాడు. అందుకే న్యాయమైన కమీషన్‌తోపాటు పరికరాల నిర్వహణ, ఇంటర్నెట్, విద్యుత్ వంటి సాంకేతిక సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి. ప్రజల హక్కు పొందడానికి మధ్యవర్తి అవసరం లేని వ్యవస్థను నిర్మించాలి. ఫిర్యాదు చేస్తే సమయ పరిమితిలో పరిష్కారం చూపాలి. తప్పిదం జరిగితే బాధ్యులపై చర్య ఉండాలి. ఇదే నిజమైన పారదర్శకత, ఇదే బాధ్యతాయుతమైన సంక్షేమ పాలన. బొమ్మ ఎవరిదన్నది రాజకీయాలకు వదిలేద్దాం. కానీ పేదవాడి చేతిలోని కార్డు ఆకలి ముందు పని చేస్తుందా? అన్నదే ప్రభుత్వానికి అసలు పరీక్ష. కేంద్రం తన వాటా చెప్పాలి. రాష్ట్రం తన వాటా చెప్పాలి. డీలర్ కమీషన్ చెప్పాలి. సన్నబియ్యం వ్యయం చెప్పాలి. కార్డు తయారీ ఖర్చు చెప్పాలి. అప్పుడు ప్రజలే ఎవరి పాత్ర ఎంతన్నది నిర్ణయిస్తారు. బొమ్మల పంచాయితీ ముగియాలి. బియ్యం లెక్క తేలాలి. డీలర్‌కు న్యాయం జరగాలి. వేలిముద్ర విఫలమైతే ఐరిస్ రావాలి.

# 31 సర్వీసులతో భోగాపురం

విజయనగరం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో సరికొత్త సందడి నెలకొంది. ఈనెల 17 నుంచి పూర్తిస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయి. ఈనెల 1న ప్రధాని నరేంద్ర మోడీ ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. అయితే 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం అవుతాయని పౌర విమానయాన ఇప్పటికే ప్రకటన చేసింది. అయితే దానికి కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ప్రైవేటు ఎయిర్లైన్స్ సైతం తమ సర్వీసులను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే తొలి రోజు ఏకంగా 31 సర్వీసులను నడప నుంది ఇండిగో ఎయిర్లైన్స్. హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, చెన్నై సహా పలు నగరాలకు ఈ విమానాలు నడవనున్నాయి. తన తొలి రోజు సర్వీస్ లను ప్రకటించింది ఇండిగో ఎయిర్లైన్స్. ఈనెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు రద్దు అవుతాయి. అక్కడ నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి మొదలవుతాయి. ఈ క్రమంలో విమాన సర్వీసుల రాకపోకలపై ఎయిర్లైన్స్ సంస్థలు ఒక్కొక్కటి షెడ్యూల్ విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండిగో విమానయాన సంస్థ తొలి రోజు 31 సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపింది. భోగాపురం నుంచి ఆరోజు ఉదయం 8:55, 10:40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4:25, రాత్రి 7:20, 8:40, 9 20 గంటలకు విమానాలు బయలుదేరనున్నాయి. భోగాపురం నుంచి ఢిల్లీకి ఉదయం 8:20, రాత్రి 10:45? బెంగళూరుకు మధ్యాహ్నం 2:55, రాత్రి 9:10, చెన్నైకి మధ్యాహ్నం 12:15, సాయంత్రం 6:35.. కోల్కత్తా కు రాత్రి 7:50, ముంబైకి మధ్యాహ్నం 3:05, తిరుపతికి మధ్యాహ్నం 1:50 గంటలకు విమానాలు అందుబాటులోకి వస్తాయని ఇండిగో తెలిపింది మరోవైపు ఎయిర్ ఇండియా కూడా అక్టోబర్ 24 వరకు భోగాపురం నుంచి నడిచే విమానాల షెడ్యూల్ ను ప్రకటించింది. హైదరాబాదు నుంచి భోగాపురం మధ్య రోజుకు ఐదు సర్వీసులు.. బెంగళూరు నుంచి భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులు నడపనుంది. ఆది, శుక్రవారం మినహా మిగిలిన ఐదు రోజులు మరో సర్వీస్ అందుబాటులో ఉంటుంది. విజయవాడ నుంచి భోగాపురం మధ్య రోజుకు నాలుగు సర్వీసులు నడవనున్నాయి. భోగాపురం ఎయిర్పోర్ట్ నుంచి కమర్షియల్ సర్వీసులో తొలి విమానం సింగపూర్ కు వెళ్లనుంది. ఆగస్టు 16న రాత్రి 11:05 గంటలకు స్కూట్ ఎయిర్లైన్స్ విమానం భోగాపురం లో ల్యాండ్ అవుతుంది. ఈ విమానం గంట తర్వాత 12:05 గంటలకు సింగపూర్ బయలుదేరుతుం

# తెరపైకి క్రెడిట్ వార్

ఏలూరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు మళ్లీ వార్తలకె?క్కింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ఫేజ్-1 నిర్మాణ సవరించిన అంచనా వ్యయానికి రూ.30,436.95 కోట్లు ఆమోదించడం, దాదాపు రూ.12,157 కోట్లకు పైగా బ్యాలెన్స్ గ్రాంట్‌ను ఖరారు చేయడంతో రాష్ట్రంలో క్రెడిట్ గేమ్ జోరందుకుంది. కేంద్రంలో పట్టుబట్టి, ఎన్డీయే భాగస్వామిగా ఒత్తిడి తెచ్చి పోలవరానికి రూ.12,000 కోట్లకు పైగా ప్రత్యేక నిధులు తీసుకువచ్చామని, ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని అధికార కూటమి ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, తమ హయాంలోనే ఫేజ్-1 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి, 41.15 మీటర్ల పరిమితికి అనుగుణంగా సాంకేతిక అనుమతులు సాధించామని, ఆ కష్టఫలమే నేడు కేంద్రం ఇచ్చిన ఆమోదమని వైఎస్ఆర్‌సీపీ తమ ఖాతాలో వేసుకునే యత్నం చేస్తోంది. ఈ పొలిటికల్ డిబేట్‌లో ఇరుపక్షాలు విసురుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందని, డయాఫ్రమ్ వాల్‌తో సహా ప్రధాన నిర్మాణాలను వేగవంతం చేసిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నాయి. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఏజెన్సీని మార్చడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, 2020 గోదావరి వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి జగన్ సర్కార్ అజ్ఞానమే కారణమని టీడీపీ తీవ్రంగా కౌంటర్ ఇస్తోంది. దానికి పోటీగా, పోలవరం కాంట్రాక్టులను నాటి టీడీపీ ప్రభుత్వం తమ అనుకూల ఏజెన్సీలకు కట్టబెట్టి అంచనాలు పెంచేసిందని, తాము వచ్చి అవినీతిని అరికట్టి నిధులను సద్వినియోగం చేశామని వైఎస్ఆర్‌సీపీ కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ గేమ్ లో పొలిటికల్ లీడర్లు ఎవరు పైచేయి సాధించినా.. ప్రజా క్షేత్రంలో మాత్రం అసలైన విజేత ప్రాజెక్టు పూర్తయినప్పుడే తేలుతుంది. కేవలం మాటల విన్యాసాల వల్ల ఓటర్లు ఓట్లేయరనేది గత అనుభవాలు నిరూపించాయి. జగన్ హయాంలో రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు ఐదేళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, రూ.15,000 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రెడిట్ దక్కించుకోవాలంటే కేవలం వైఎస్ఆర్‌సీపీపై నిందలు వేస్తే సరిపోదు; అనుకున్న గడువులోగా గ్రావిటీ ద్వారా నీళ్లను అందించాల్సి ఉంటుంది. కేంద్ర జలశక్తి శాఖ రాజ్యసభ వేదికగా స్పష్టం చేసిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే కాంక్రీట్ పనులు 98.84%, ప్రధాన కాలువల తవ్వకం 98.96% వరకు పూర్తయ్యాయి. అయితే, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడం అత్యంత కీలకమైన సవాలు. కేంద్ర జలశక్తి శాఖ అంచనాల ప్రకారం తొలి దశ 41.15 మీటర్ల నీటి మట్టం పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే మరొక ఏడాది కాలపరిమితి పెరిగినా.. 2027 నాటికి తొలి దశ నీటిని నిల్వ చేసి, కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. పోలవరం కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజనులు, రైతుల పునరావాస సమస్య. ఫేజ్-1 లో దాదాపు 96,660 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 17,892 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. నీరు నిల్వ చేయాలంటే మిగిలిన వేలాది కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇచ్చి ఖాళీ చేయించాలి. కాబట్టి, డ్యామ్ నిర్మాణం 2026-27 నాటికి పూర్తయినా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిధుల సమస్య లేకుండా పునరావాసం పూర్తి చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో నీటి ఫలాలు అందుతాయి. రాజకీయం పక్కనపెట్టి, కేంద్రం ఇచ్చిన నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడమే ఏపీ భవిష్యత్తుకు శ్రీరామరక్ష

# హెచ్ఏఎల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ భూములను కాపాడాలి

రంగారెడ్డి,మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హెచ్ఏఎల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. హైకోర్టు పోలీసు ప్రొటెక్షన్ ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని అధ్యక్షుడు ప్రసాద్ విజ్ఞప్తి చేసారు. 1981లో సర్వే నెం.77లో 62 ఎకరాల భూమి కొనుగోలు చేశామని వెల్లడించారు. 43 ఏళ్లుగా భూమి సొసైటీ స్వాధీనంలోనే ఉందని స్పష్టం చేసారు. అక్రమ కబ్జాదారులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సొసైటీ సభ్యులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సభ్యులంతా 70 నుంచి 90 ఏళ్ల వయస్సు గల రిటైర్డ్ సీనియర్ సిటిజన్లని వెల్లడించారు. కోర్టు రక్షణ ఉత్తర్వులు ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. పోలీసు శాఖ వెంటనే స్పందించి భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. వయోవృద్ధ సభ్యులకు న్యాయం చేయాలని అధ్యక్షుడు ప్రసాద్ విజ్ఞప్తి చేసారు.

# గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

హైదరాబాద్, 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు–2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పుష్కరాలు విజయవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

# క్యాష్ కంట్రావర్సీలో మంత్రిగారు...

హైదరాబాద్, విదేశాలలో ఉన్న మనవాళ్లు ఇండియాకు డబ్బులు పంపిస్తుంటారు. ఇది ఎప్పటినుంచో జరుగుతున్నది. కానీ ఆ మంత్రి గారు దీనిని మార్చేశారు. ఏకంగా తెలంగాణ నుంచి విదేశాలకు డబ్బులు తీసుకెళ్లారు. అదికూడా కట్టల కొద్దీ నోట్లతో వెళ్లారు. చివరికి అడ్డంగా దొరికిపోయారుఆ మంత్రి మీద అనేక రకాలుగా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన భార్య ఏకంగా రంగంలోకి దిగి కమిషన్ ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తారని అభియోగాలు ఉన్నాయి. పైగా ఆయన నీతి వాక్యాలు చెప్పడంలో దిట్ట. తనకు తాను సంఘసంస్కర్తను అని చెప్పుకుంటారు. కానీ లోపల మాత్రం కమిషన్లు లాగుతూ ఉంటారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మంత్రి పర్సంటేజ్ మినిస్టర్ అవతారం ఎత్తారు. కీలకమైన శాఖలను ఆయన తన వద్ద పెట్టుకున్నారు. అందులో భారీగా కాంట్రాక్టులు.. బిల్లులను మంజూరు చేయడానికి కమిషన్లు వసూలు చేయడం ప్రారంభించారు. ఈయనకు 30% కమిషన్ మినిస్టర్ గా పేరుంది. దీన్నిబట్టి సదరు మంత్రివర్యుల వసూళ్ల స్థాయి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.మంత్రిగారి భార్య వసూళ్ల వ్యవహారాన్ని చక్కబెడతారని సమాచారం. మీడియం, బిలో మీడియం అమౌంట్లు మొత్తం సదరు మంత్రిగారి భార్యనే సెటిల్ చేస్తారు. హై రేంజ్ అమౌంట్ ను మాత్రమే మంత్రిగారు చూసుకుంటారు. ఇక ఇటీవల ఆ మంత్రి గారు విదేశాలకు వెళ్లారు. అక్కడికి వెళుతూ భారీగా డబ్బులను తీసుకెళ్లారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు విమానాశ్రయంలో అడ్డుకోవడంతో మంత్రిగారికి ఒక్కసారిగా షాక్ తగిలింది. సుమారు గంటన్నర పాటు ఆయన విమానాశ్రయంలోనే కూర్చోవలసి వచ్చింది..."ఇంత భారీ స్థాయిలో డబ్బు ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. ఎందుకు తీసుకెళ్తున్నారు.. ఎక్కడి నుంచి సమకూర్చుకున్నారు వంటి ప్రశ్నలు అక్కడి విమానాశ్రయ అధికారులు వేసినట్టు సమాచారం..అంత భారీ స్థాయిలో డబ్బు తీసుకెళ్లడం పట్ల విమానాశ్రయ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సదరు మంత్రిని విమానాశ్రయంలోనే నిలిపివేశారు. మంత్రికి ఆహ్వానం పలకడానికి వచ్చిన వారంతా ఈ ఘటన గురించి తెలుసుకొని షాక్ కు గురయ్యారు. ఆ తర్వాత అక్కడివారు విమానాశ్రయ అధికారులను ఒప్పించడంతో.. ఆ డబ్బు తీసుకెళ్లడానికి లైన్ క్లియర్ అయింది. అయితే ఆ డబ్బును సదరు మంత్రి అక్కడికి ఎందుకు తీసుకెళ్లారు.. దాంతో ఏం చేయబోతున్నారనేది.. ఇప్పుడు రాజకీయ వర్గాలలో తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. ఓ వర్గం మీడియా దీనిని దాచే ప్రయత్నం చేసినప్పటికీ సోషల్ మీడియా స్ట్రాంగ్ కదా..ఎలా దాగుతుంది..మొత్తానికి అంతా తెలిసిపోయింది.

# రేవంత్ ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, రాజకీయాలలో గతంలో ఈ స్థాయిలో సంచలన పరిణామాలు జరిగేవి కావు. కానీ ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకొని గులాబీ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. చివరికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రేవంత్ నాయకత్వాన్ని తప్పుపడుతున్నారు. ఇక ఒక ఎమ్మెల్యే అయితే మరింత ముందడుగు వేసి రేవంత్ ముందే.. అనకూడని మాట అనేశాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. తొందరపాటు వల్ల జరిగిందా అనే విషయాన్ని పక్కన పెడితే.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. ఒకసారిగా సీఎం కేసీఆర్ అని సంబోధించారు. దీంతో అక్కడ వాతావరణం మారిపోయింది. ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని దానం నాగేందర్ సీఎం రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను గులాబీ పార్టీ నేతలు విస్తృతంగా సర్కులేట్ చేస్తున్నారు. గతంలో కూడా రేవంత్ రెడ్డిని ఓ కార్యక్రమానికి నిర్వాహకులు ఆహ్వానించారు. ఆ సమయంలో వేదిక ముందు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అనబోయి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆ తర్వాత అల్లు అర్జున్ కూడా ఓ కార్యక్రమంలో సీఎం పేరును తప్పుగా పలికారు. ఇలా అనేక సందర్భాలలో రేవంత్ రెడ్డి పేరును నిర్వాహకులు మర్చిపోయారు. చివరికి కాంగ్రెస్ నాయకులు కూడా రేవంత్ రెడ్డి పేరుకు బదులుగా కేసీఆర్ పేరు పలికారు. దీంతో ఇది గులాబీ పార్టీ నేతలకు ఆయుధంగా మారింది. రేవంత్ రెడ్డి పేరు సీఎంగా ఎవరూ గుర్తుంచుకోవడంలేదని.. కెసిఆర్ తెలంగాణ ప్రజల్లో.. తెలంగాణ నాయకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని గులాబీ పార్టీ నేతలు కవరింగ్ ఇచ్చుకోవడం మొదలుపెట్టారు.ఏదైనా సభ జరిగినప్పుడు.. సమావేశం నిర్వహిస్తున్నప్పుడు నిర్వాహకుల్లో ఒక రకమైన ఒత్తిడి ఉంటుంది. వారిలో తెలియని ఉద్వేగం ఉంటుంది. అప్పుడు వారు మాట్లాడుతున్నప్పుడు తప్పులు దొర్లుతుంటాయి. కాకపోతే నేటి సోషల్ మీడియా కాలంలో ఇటువంటి వాటికే ఆదరణ ఉంటుంది కాబట్టి.. పైగా ప్రత్యర్థి పార్టీలు ఎప్పుడు తప్పు

# వైసీపీకి క్షమాపణ..మున్ముందు ఇంకెందరో!

అమరావతి,కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఐదేళ్ల గిర్రున తిరిగే సరికి, ఓడలు కాస్త బండ్లు అవుతుంటాయి. అలాగే బండ్లు కూడా ఓడలవుతుంటాయి. ఇదే తరతరాలుగా కాలం చెప్పిన వాస్తవం. అయితే వాస్తవాల్ని తెలుసుకోకుండా, అధికారం, డబ్బు వుందని విరవీగితే, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది. ఇందుకు ఎవరూ మినహాయింపు కాదు. చంద్రబాబునాయుడు అరెస్ట్ అవుతారని, 50 రోజులకు పైగా జైలులో వుంటారని ఎవరైనా ఊహించారా?.. అబ్బే. మీ నాన్నే తనను ఏం చేసుకోలేకపోయారని, నువ్వెంత అంటూ పదేపదే వైఎస్ జగన్‌ను చంద్రబాబు రెచ్చగొట్టేవారు. 50 రోజులు జైల్లో వుండి వచ్చారు. ఇప్పుడు చంద్రబాబు రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. నువ్వేం చేసుకోలేవని, ఇప్పుడు జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు అనడం లేదు. ఎందుకంటే, ఆయనకు తత్వం బోధపడింది.కానీ చంద్రబాబు తనయుడు లోకేశ్, అలాగే టీడీపీలోని మరికొందరికి భవిష్యత్ గురించి భయం, బెంగ లేనట్టుంది. శాశ్వతంగా రాష్ట్రాన్ని తామే పాలిస్తామని భ్రమలో మునిగితేలుతున్న వాళ్లు, వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతి, అలాగే ఇతర వైసీపీ నేతలు, వారి కుటుంబంలోని మహిళలపై నీచ వ్యాఖ్యలు చేస్తున్నారు. మనల్ని ఎవర్రా టచ్ చేసేదనే అహంకారం నోటి దురుసు ప్రదర్శించే వాళ్లలో కనిపిస్తోంది.గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు, ఇలాగే చంద్రబాబుతో పాటు టీడీపీకి చెందిన కొంత మందిపై అవాకులు చెవాకులు పేలారు. కూటమి అధికారంలోకి వచ్చాక, అలాంటి వాళ్లందరికీ ఏం జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కేసులు, జైళ్ల పేరుతో రాష్ట్రమంతా తిప్పి, మూడు చెరువుల నీళ్లు తాగించారు. ఇక పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు అదనం.ఇప్పుడు అలాంటి వాళ్లంతా ఒళ్లు దగ్గర పెట్టుకుని, ఎక్కడున్నారో కూడా తెలియకుండా బతుకుతున్నారు. అయితే అధికారం తీసుకొచ్చే అహంకారంతో టీడీపీతో పాటు జనసేన, అలాగే చాలా తక్కువ మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు నోటి దురుసు ప్రదర్శిస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఏ రీతిలో నోరు పారేసుకున్నారో తెలిసిందే. నానాజీని మందలించాల్సింది పోయి, బహిరంగంగా ఆయన్ను పవన్‌కల్యాణ్ వెనకేసుకొచ్చారు. అధికారంలో వుండడం, జగన్‌ను తిట్టడంతో సొంత పార్టీ ఎమ్మెల్యే నానాజీ బాగా నచ్చినట్టున్నారు. అయితే ఇలాంటి వాటికి మూల్యం చెల్లించుకోడానికి నానాజీ లేదా ఇంకే స్థాయి నాయకుడైనా కాలం కోసం ఎదురు చూడక తప్పదు.తాజాగా కుప్పం వైసీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ భరత్‌కు క్షమాపణ చెబుతూ బీజేపీ యువమోర్చా నాయకుడు వీడియో విడుదల చేశాడు. ఈ నెల 10న కుప్పంలో డీఎస్సీ అక్రమాలపై వైసీపీ ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కుప్పంలో భరత్ ఇంటి వద్దకు కూటమి నేతలు వెళ్లారు. భరత్‌ను రాయలేని భాషలో కుప్పం మండల బీజేపీ యువమోర్చా నాయకుడు తిట్టాడు. ఆ తర్వాత అతను పశ్చాత్తాపం చెందాడు. భరత్‌కు క్షమాపణ చెప్పడంతో పాటు పార్టీ పదవికి రాజీనామా చేశాడు.ఇటీవల ఇదే రీతిలో మిమిక్రీ ఆర్టిస్ట్ రావినూతల సునీల్ కూడా వైఎస్ జగన్‌కు క్షమాపణ చెబుతూ వీడియో విడుదల చేశాడు. జగన్‌పై తనకు ఎలాంటి కోపం లేదని, డబ్బు కోసం ఇదంతా చేస్తున్నట్టు ప్రకటించాడు. మరోసారి పునరావృతం కానివ్వనని అతను వివరణ ఇచ్చుకున్నాడు.అంతెందుకు, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డినే తీసుకుందాం. రెండు రోజుల క్రితం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాడిపత్రికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రానివ్వనందుకు తీవ్ర ఆవేదన చెందారు. అలాగే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై తప్ప, మరే వైసీపీ నాయకులపై తనకు కోపం లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ నాయకులు, జగన్‌కు ఆయన క్షమాపణ చెప్పారు.ఇక రాయలసీమ పేరుతో వైసీపీ కండువా కప్పుకుని, నిత్యం వైఎస్ జగన్, ఆయన పార్టీ నాయకులపై అసభ్యంగా వీడియోలు చేస్తున్న వ్యక్తిని ప్రతిపక్షం బాగా గుర్తించుకుంది. అలాగే జబర్దస్త్ కమెడియన్ కూడా తానేం తక్కువ తినలేదని, వైసీపీ నేతలపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. ఇలాంటి వాళ్లందరినీ వైసీపీ తన డిజిటల్ బుక్‌లో రికార్డ్ చేసుకుంది.ఆ మధ్య టీడీపీ అనుకూల పత్రికాధిపతి తన వీకెండ్ కామెంట్‌లో



వైసీపీ నేతలు తమ భార్యల్ని, జగన్ చెబితే పెళ్లి సంబంధాలు చూసి, చేస్తారని అసహ్యకర రాతలు రాశాడు. తప్పునకు క్షమాపణ చెప్పకపోగా, వైసీపీ నేతలపైనే బుకాయింపుకు దిగాడు. ఇవన్నీ కూడా వైసీపీ నేతలెవరూ మరిచిపోయే పరిస్థితి వుండదు.ఈ మధ్య వైసీపీ నేతలపై విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ఎంత నీచంగా మాట్లాడారో అందరూ విన్నారు. కేవలం చంద్రబాబు, లోకేశ్ గుడ్ లుక్స్‌లో పడేందుకే బొండా ఉమా అనుచిత కామెంట్స్ చేశారని చిన్న పిల్లల్ని అడిగినా చెబుతారు.అలాగే మాజీ మంత్రులు బొడా ఉమా, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు, విధ్వంసాన్ని వైసీపీ బాగా గుర్తు పెట్టుకుంది. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మెప్పు కోసం మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారనే ఆవేదన వైసీపీ నేతల్లో వుంది.కేవలం చంద్రబాబు, లోకేశ్ దయతో రాజకీయ మనుగడ వుంటుందని నమ్మేవాళ్లే వైఎస్ జగన్‌పై నోరు పారేసుకుంటున్నట్టు కూటమి నేతలు చెబుతున్నారు. వైఎస్ జగన్ తల్లి విజయమ్మ, భార్య భారతిపై వంగలపూడి అనిత నీచ కామెంట్స్‌ను వైసీపీ పదేపదే గుర్తు చేస్తోందంటే, ఎంతగా హర్ట్ చేసిందో అర్థం చేసుకోవచ్చు. అయితే అప్పట్లో వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ, అనిత విషయంలో సంయమనంతో వ్యవహరించారు. కానీ ఇకపై అలా వుండకపోవచ్చని వైసీపీ నాయకులు అంటున్న మాట.అలాగే జనసేన వీరమహిళ, ఆ పార్టీ అధికార ప్రతినిధి కూడా వైఎస్ జగన్ పిల్లలపై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎలాంటి పదవికి నోచుకోక, తీవ్ర ఒత్తిడిలో ఉన్నోళ్లే జగన్‌పై నోరు పారేసుకుంటే, గుర్తించి అందలం ఎక్కిస్తారనే భ్రమలో ఉన్నారు. కానీ అలాంటి వాళ్లకు పదవుల సంగతేమో గానీ, అధికారం పోతే మాత్రం బడితె పూజ మాత్రం తప్పదని వైసీపీ నేతలు హెచ్చరిస్తున్నారు. నిజానికి ఇప్పుడు కూటమి పెడుతున్న కేసులు, వేధింపులతో పోలిస్తే, గతంలో వైసీపీ హయాంలో జరిగినవి తక్కువే అనే అభిప్రాయం వుంది. ఈ దఫా మాత్రం ప్రతి కేసుకు, వేధింపునకు, దాడికి భారీ మూల్యం చెల్లించాల్సిందే అని వైసీపీ పట్టుదలతో వుంది. ప్రతీకార రాజకీయాలు ఏ సమాజానికి మంచిదికాదు. దాని వల్ల అభివృద్ధి ఆగిపోతుంది. ఎందుకంటే, ఏ వ్యవస్థ అయినా ప్రగతి పథంలో ముందుకెళ్లాలంటే, రాజకీయ వ్యవస్థ బాగుండాలి.దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థ రోజురోజుకూ పాతాళానికి పడిపోతోంది. ఇదేమీ ఇప్పట్లో ఆగే పరిస్థితి కనిపించడం లేదు. ఇవే రాజకీయ పార్టీలు, నాయకులు ఉన్నంత కాలం ఆంధ్రప్రదేశ్‌ను ఎవరూ బాగుపరచలేరు. ఏపీలో రాజకీయ వ్యవస్థ కంటే మీడియా రంగం మరింత భ్రష్టు పట్టింది. రాజకీయ పక్షాల కంటే, ఎక్కువగా మీడియా సంస్థలు రాజకీయ ఎజెండాతో ముందుకెళ్తున్నాయి. గిట్టని వారిపై నిస్సిగ్గుగా విషం చిమ్మడానికి వెనుకాడని దుస్థితి ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నారు.అయితే అధికారంలో ఉన్నప్పుడు, అంతా బాగా వున్నట్టే కనిపిస్తుంది. ఒక్కసారి మారితే ఏమవుతుందో ఊహించుకుంటే, ఇప్పుడీ దాష్టికాలకు ఎవరూ పాల్పడరు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్, అలాగే వైసీపీ నేతలకు క్షమాపణ చెప్పే వాళ్ల సంఖ్య ఎక్కువే వుండే అవకాశం వుంది. అధికారమనే అహంకారం వదిలితే, తాము చేసిన తప్పులేంటో తెలుస్తుంది. కాలం ఎంతటి వారి కొమ్ములైనా విరిచేస్తుంది. కాలం ముందు ఎవరూ గొప్పవాళ్లు కాదు. నోరు జారే ముందు... తస్మాత్ జాగ్రత్త!

# సప్తధార.. భారత్ అభివృద్ధికి మోదీ మాస్టర్‌ప్లాన్ ఇదే



న్యూఢిల్లీ,స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను 'శక్తి సప్తధార'గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త నినాదాన్ని అందించారు. సప్తధార శక్తి పేరుతో ఆయా రంగాలకు, వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటించారు. ముఖ్యంగా యువతరానికి ఇచ్చే ప్రయార్టీని మోదీ పదే పదే హైలైట్ చేశారు. జెన్‌జీ ఉద్యమాల నేపథ్యంలో వారి విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే తన సంకల్పాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే సంకల్పం, దేశ ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ సంకల్పం ప్రపంచం భారతదేశాన్ని భిన్నంగా చూసేలా చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.ఈ రోజు భారత్ ఒక గొప్ప కలను కంటోంది. కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని పూర్తి సంకల్పంతో కలలు కంటోంది. ఆ కల ఏమిటంటే, 2047లో భారతదేశం తన స్వాతంత్ర్యానికి 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు, మనం కచ్చితంగా 'అభివృద్ధి చెందిన భారత్‌ను' నిర్మించి, దానిని సాకారం చేస్తాం.140 కోట్ల మంది పౌరుల కృషి, ప్రయత్నాల ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలని సంకల్పించినప్పుడు, అది యావత్ ప్రపంచం ముందు భారత్ ధైర్యానికి నిదర్శనంగా నిలుస్తుందని, భారత్‌పై ప్రపంచ దృక్పథాన్ని మార్చుకునేలా చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు.భారత్ కలలు, సంకల్పం గొప్పగా ఉండాలని, ఎందుకంటే గొప్ప లక్ష్యాలు దేశ సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయని ప్రధాని మోదీ అన్నారు. "మన కలలు, సంకల్పం గొప్పగా ఉండాలి, ఎందుకంటే అవి మన సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయి" అని ఆయన అన్నారు. 12 ఏళ్లలో దేశంలో జరిగిన మార్పులను, వివిధ రంగాల్లో పెరిగిన ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కాలంలో రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ దాదాపు ఏడు రెట్లు, ఆధునిక రైల్వే కోచ్‌ల ఉత్పత్తి 21 రెట్లు, మొబైల్ ఫోన్ల తయారీ 33 రెట్లు పెరిగాయని తెలిపారు. ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య, అలాగే పేటెంట్ల సంఖ్య కూడా దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రధానమంత్రి ప్రకారం, డిజిటల్ లావాదేవీలు దాదాపు 100 రెట్లు పెరిగాయి.25 కోట్ల మంది పౌరులు పేదరికాన్ని అధిగమించి దాని నుంచి బయటపడ్డారు. ఒకప్పుడు మనల్ని 'ఫ్రాజైల్ 5' (అతి బలహీనమైన ఐదు దేశాలు)లో ఒకటిగా పరిగణించేవారు. నేడు, మనం ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. 2014 నాటికి, ప్రపంచం మనల్ని 'ఫ్రాజైల్ 5' జాబితాలో బంధించింది. గత 12 సంవత్సరాలుగా, మనం వేగంగా పురోగమిస్తున్నాం.ఇరాన్–అమెరికా ఉద్రిక్తతను ప్రస్తావిస్తూ, ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి తాము సన్నాహాలు చేశామని, అవి ఫలించాయని అన్నారు. ఇంధన భద్రత ప్రస్తుత అవసరమని ప్రధాని మోదీ అన్నారు. "ఇంధనం లేకుండా ఈ నూతన ప్రపంచంలో ముందుకు సాగడం కష్టంగా మారింది. మనకు భారీ మొత్తంలో ఇంధనం అవసరం. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను లక్ష్యంగా నిర్దేశించుకున్నాం."పెట్రోల్, డీజిల్, ఎరువులను ఆయుధాలుగా వాడుతున్నారని ప్రధాని మోదీ అన్నారు. చమురు, గ్యాస్ పేరిట ప్రజలను భయపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మనం ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్నామని ప్రధాని మోదీ అన్నారు. కరోనావైరస్ కారణంగా అన్ని వ్యవస్థలు కుప్పకూలాయి. ఉక్రెయిన్ నుంచి పశ్చిమ ఆసియా వరకు... ప్రతిచోటా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. కానీ భారత్ సన్నాహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మనం మన బలాలపై నిలబడి ముందుకు సాగుతున్నాం. ఎర్రకోట ప్రాంగణం నుంచి ప్రధాని మోదీ, జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలకు ఒక ముఖ్యమైన కానుకను ప్రకటించారు. ఏడాదిలోగా కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తానని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను కూడా ఆయన ప్రకటించారు. "అభివృద్ధి చెందిన దేశంగా భారత్ సాగించే ప్రయాణంలో యువత పోషించాల్సిన పాత్ర చాలా పెద్దది. ఈ రోజు, ఎర్రకోట ప్రాంగణం నుంచి నేను దేశ యువతకు ఒక ప్రకటన చేయాలనుకుంటున్నాను. రాబోయే సంవత్సరంలో 10 మిలియన్ల యువతకు ఏఐ నైపుణ్యాల శిక్షణను అందించాలని సంకల్పించాము, తద్వారా మన దేశ యువత ఏఐ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు," అని ఆయన అన్నారు.

# మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా?

విజయవాడ, మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి – విజయవాడ – గుంటూరు గా సిఆర్‌డిఎ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది.ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు–టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది. రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది.ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ అమరావతితో పాటు బ్రౌన్ ఫీల్డ్ నగరాలైన విజయవాడ, గుంటూరులను ఎకనామిక్ కారిడార్లుగా మార్చడం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. దీనిని ప్రభుత్వం కొత్తగా దాచాల్సిన అవసరం గానీ, జగన్ దెబ్బకు భయపడి మార్చాల్సిన అవసరం గానీ లేదనేది అధికార కూటమి నేతల వాదన. పేర్ని నాని చేసిన అవిగన్ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి. రాజధానిపై గతంలో తీసుకున్న కఠిన వైఖరిని పక్కనబెట్టి, సీఆర్డీఏ పరిధి, వ్యయం, నగరాల విలీనం వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు వేయడం ద్వారా అమరావతి ప్రాంత ప్రజల్లో పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మాటల విన్యాసాలు వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తాయో కాలమే నిర్ణయించాలి.

# వైసీపీని ఇరుకున పడేస్తున్న కోర్టు తీర్పు

విజయవాడ, కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ జరిగింది అంటూ వైఎస్ఆర్‌సీపీ గత కొంతకాలంగా ఉద్యమం చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు చూపించడంలో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా విఫలమవడంతో ఆ నిరసనలకు పొలిటికల్ మైలేజ్ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ, అదే సమయంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 మూల్యాంకనంలో ఘోరమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు నివేదిక సమర్పించడం ఏపీ రాజకీయాల్లో మైండ్ గేమ్ మార్చేసింది. డీఎస్సీపై ఎలాంటి క్లూస్ ఇవ్వలేకపోయిన వైఎస్ఆర్‌సీపీకి, గ్రూప్–1 కేసు రూపంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత పవర్ ఫుల్ ఆయుధం దొరికినట్లయింది.సిట్ దాఖలు చేసిన తాజా నివేదిక ఆధారంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో వ్యవస్థాగతంగా తీవ్రమైన అవకతవకలు జరిగాయని పక్కా నిరూపణలతో సహా బయటపడింది. డిజిటల్ మూల్యాంకనం రద్దు కావడం, హాయ్‌లాండ్ రిసార్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలు తరలించడం, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై సరిదిద్దడం వరకు చోటుచేసుకున్న తీరు షాకింగ్‌గా ఉంది. ల్యాబ్ ఫోరెన్సిక్ రిపోర్టుల ప్రకారం తనిఖీ చేసిన 736 వాల్యుయేషన్ రికార్డుల్లో ఏకంగా 718 రికార్డులలోఅంటే 97.55 శాతం దిద్దుబాట్లు, ఓవర్ రైటింగ్‌లు జరిగాయని తేలడం నాటి వ్యవహారం ఎంత దారుణంగా సాగిందో తెలియజేస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి లేకుండానే జవాబు పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, 84 రోజుల పాటు ప్రైవేట్ ఏజెన్సీ క్యామ్‌సైన్ మీడియా కస్టడీలో ఉంచడం వెనుక ఆయనే కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. దాదాపు రూ.1.14 కోట్ల ప్రజాధనాన్ని సదరు ఏజెన్సీకి అప్పగించి, కేవలం ముందస్తు డిజిటల్ మార్కులను మళ్లీ నాఖీ రికార్డుల్లో ఎంట్రీ చేయించేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించారనే ఆరోపణలు నాడు ఐపీఎస్ అధికారి హోదాలో ఆయన నడిపిన నెట్‌వర్క్‌ను ఎండగడుతున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం మ్యాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ వాడటం, సీనియర్ ఎగ్జామినర్ల సంతకాలు లేకపోవడం, కొత్త సంతకాలు కలవకపోవడం, 197 మందికి మార్కులు పెంచి, 222 మందికి మార్కులు తగ్గించడం వెనుక పెద్ద ఎత్తున పొలిటికల్ అండ్ ఫైనాన్షియల్ డీలింగ్స్ ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. సీఎస్ ఆప్షన్ లేని చోట నాటి వైఎస్ఆర్‌సీపీ పెద్దల ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆధారంగానే మార్కులు మార్చారని సిట్ రిపోర్ట్ తేల్చిచెప్పడం గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న గ్రూప్–1 అధికారులను గనుక సిట్ లోతుగా ప్రశ్నిస్తే మరింత సంచలన విషయాలు బయటకు రావడం ఖాయం. నాటి మూల్యాంకనంలో అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసి, ఎవరెవరికి మార్కులు పెంచి కొలువులు కట్టబెట్టారో లబ్ధిదారులైన అధికారుల మూలాల నుంచి వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఎస్సీ పరీక్షలపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన వైఎస్ఆర్‌సీపీ.. ఇప్పుడు గ్రూప్–1 సిట్ నివేదికతో తామే ఇరుక్కుపోయిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందే నిరుద్యోగ ఓట్ బ్యాంకును ఆకట్టుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ ప్రయత్నించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాటి గ్రూప్–1 స్కామ్‌ను ఎండగడుతూ రివర్స్ కౌంటర్ ఇస్తోంది.

# లోకేష్ కి పట్టాభిషేకం...ఇపుడు ఎందుకీ ప్రచారం ?



అమరావతి,తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు తరువాత సర్వసత్తాక నాయకుడు ఎవరు అంటే రెండో మాట లేకుండా చెప్పే పేరు నారా లోకేష్ అని. అవును ఆయన పార్టీకి జాతీయ స్థాయిలో వర్కింగ్ ప్రెసిడెంట్. పార్టీలో కీలకమైన నిర్ణయాలలో లోకేష్ పాత్ర ఉంటోందని కూడా ప్రచారం సాగుతోంది. ఇక ప్రభుత్వంలో లోకేష్ పాత్ర ఎంత ఏమిటి అంటే టీడీపీకి 20 మంది మంత్రులు ఉన్నారు. అందులో లోకేష్ కాక పందొమ్మిది మంత్రులతోనూ లోకేష్ మీటింగ్స్ సొంతంగా నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. లోకేష్ విదేశీ పర్యటనలు పూర్తి చేసుకుని వస్తే ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ మంత్రులు ఆయనతో సమావేశాలు జరిపిన నేపథ్యం కూడా ఉంది. పార్టీలో ప్రభుత్వంలో అలా లోకేష్ పాత్ర అయితే స్పష్టం. అయితే లోకేష్ ని టీడీపీ వరకూ కాబోయే సీఎం గానే అంతా చూస్తున్నారు. అది కూడా ఇపుడు కాదని 2029 ఎన్నికల తరువాతని రాజకీయ విశ్లేషకుల మాట కూడా ఉంది. కానీ ఇపుడు సడెన్ గా ఒక రూమర్ అనుకోండి, గాసిప్స్ అనుకోండి అలాంటి ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. అదేంటి అంటే లోకేష్ కి తొందరలోనే పట్టాభిషేకం జరుగుతుందని.

స్థానిక ఎన్నికల తరువాత :

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రస్తుతానికి రెండేళ్ళు పై దాటింది. ఈ డిసెంబర్ నాటికి రెండున్నరేళ్ళు అవుతుంది అంటే సగం పాలన పూర్తి అయినట్లు అన్న మాట. ఆ సమయానికి లోకేష్ ని ముఖ్యమంత్రిగా చేసే ప్రతిపాదన అయితే టీడీపీలో సీరియస్ గానే సాగుతోంది అని అంటున్నారు. దీని కంటే ముందు స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబర్ లో నిర్వహించి ఒక కీలక ఘట్టాన్ని ముగిస్తారు అని అంటున్నారు. ఆ తరువాత లోకేష్ కి పట్టాభిషేకం జరుగుతుందని, దాని కోసం శుభ ముహూర్తాన్ని సిద్ధం చేసి ఉంచారని కూడా అంటున్నారు.

అవునా నిజమా అంటే :

ఇది ఏపీ రాజకీయాల్లో చూస్తే అతి పెద్ద సంచలన వార్తగానే భావించాలి. జాతీయ స్థాయిలో చూస్తే ఒక సాధారణ వార్త మాత్రమే. ఎందుకంటే దేశంలో చాలా చోట్ల తండ్రుల తరువాత తనయులు రాజకీయంగా చురుకుగా ఉంటూ అధికార పదవులు చేపట్టిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి కాబట్టి. ఇక ఏపీలో చూస్తే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమికి 2024లో 164 సీట్లు వచ్చాయి. అందులో జనసేన 21, బీజేపీ ఎనిమిది తీసేస్తే టీడీపీకే సొంతంగా 135 సీట్లు ఉన్నాయి. మొత్తం 175 మంది ఉన్న అసెంబ్లీలో ఇది బాహుబలి మార్క్ మెజారిటీ అని వేరీగా చెప్పాల్సిన పని లేదు. మరి ఇంతటి మెజారిటీ ఉన్నపుడు టీడీపీ సొంతంగా నిర్ణయాలు తీసుకుని ఏమైనా చేయవచ్చు. అయితే కూటమి పార్టీల అభిప్రాయాలు కూడా తెలుసుకుని మసలుకోవడం కోసమే ఇన్నాళ్ళ జాప్యం అని అంటున్నారు.

జరిగే వీలుందా :

అంటే రాజకీయాల్లో ఎపుడైనా ఏమైనా జరగవచ్చు అని అంటున్నారు. ఇక చూస్తే తెలుగుదేశం పార్టీ ఈ దిశగా ఆలోచన చేస్తోంది అని కాపునాడు నాయకుడు దాసరి రాము చెబుతున్నారు. ఆయన ఒక చానల్ లో మాట్లాడుతూ తనకు ఈ మేరకు కచ్చితమైన సమాచారం ఉందని అన్నారు. తెలంగాణాలో కేటీఆర్ ని సీఎం గా సరైన సమయంలో కేసీఆర్ చేయలేకపోయారు అని అలాగేయూపీయే ప్రభుత్వం రెండు టెర్ములు అధికారంలో ఉన్నా రాహుల్ గాంధీ ప్రధాని కాకుండా తప్పు చేశారని అలాంటి పొరపాట్లు రానీయకుండా టీడీపీ ముందుగానే ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటోందని ఆయన అంటున్నారు. దాసరి రాము చెప్పారని కాదు కానీ ఈ ప్రచారం అయితే గట్టిగానే ఉంది. ఇక కేంద్రంలో మోదీ కూడా లోకేష్ పనితీరు పట్ల సంతృప్తిగానే ఉన్నారు. ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు ఓపెనింగ్ తరువాత ఆయన లోకేష్ భుజం తట్టిన తీరుని అంతా చూశారు. అంతకు ముందు కూడా ఆయన యువనేత లోకేష్ సామర్థ్యాన్ని మెచ్చుకున్నారని చెబుతారు. ఈ నేపథ్యంలో లోకేష్ పగ్గాలు అందుకోవడానికి అయితే సరిగ్గా ఇదే సరైన ముహూర్తం అన్న మాట కూడా ఉంది. మరి ఈ పుకార్లు లేదా కొందరు చెబుతున్న మాటలు ఏ మేరకు నిజం అవుతాయి అన్నది చూడాల్సి ఉంది.

# రెండో ఉద్యమం మొదలు పెట్టిన సీజేపీకి బిగ్ షాక్.. ఒకరి మృతి

న్యూఢిల్లీ: 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం చేపట్టిన రెండో రోజే సీజేపీకి భారీ షాక్ తగిలింది. పాఠశాల సమస్యలను అందరి దృష్టికి తీసుకురావాలనుకున్న సీజేపీ మద్దతుదారుడి తండ్రిని కొందరు కొట్టి చంపారు. పశ్చిమ బెంగాల్‌లోని బంకురాకు చెందిన కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారుడి తండ్రి ఆగస్టు 15న మృతి చెందారు. సీజేపీ చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా తన చిన్నతనంలో చదువుకున్న పాఠశాల పరిస్థితులను అతడి కుమారుడు వీడియో తీసినందుకు ఆగ్రహించిన కొందరు వ్యక్తులు ఇంట్లోనే ఆయనపై దాడి చేశారని పోలీసులు, కుటుంబ సభ్యులు ఆదివారం జాతీయ మీడియాకు తెలిపారు. మృతుడి కుమారుడి పేరు అబ్దుల్ హఫీజ్. దాడికి బీజేపీ కార్యకర్తలే కారణమని ఆరోపించిన అబ్దుల్ హఫీజ్.. దాడిలో గాయపడిన తన తండ్రి బంకురాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. "ఈ బీజేపీ స్థానిక నేతలు దారుణంగా దాడి చేసిన తర్వాత నా తండ్రి శనివారం మృతి చెందారు" అని హఫీజ్ చెప్పారు. బంకురా ఎస్పీ వీజీ సతీష్ పసుమర్తి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. "హఫీజ్ తల్లి ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్లు మాకు సమాచారం అందింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు. ఇదిలా ఉండగా, తమ కార్యకర్తలకు ఈ ఘటనతో సంబంధం ఉన్నట్లు తేలి, వారిపై పేర్లతో పోలీసులకు ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ తెలిపింది. "అయితే, టీఎంసీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ వ్యక్తి సామాజిక తనిఖీ చేసే ధైర్యం చేశారా? కొత్తగా అధికారంలోకి వచ్చిన బీజేపీని చెడుగా చూపించేందుకు టీఎంసీ, వామపక్షాలు చేస్తున్న పద్ధతి ఇది మాత్రమే" అని బీజేపీ బెంగాల్ అధికార ప్రతినిధి కేయా ఘోష్ చెప్పారు. జంతర్ మంతర్‌లో జరిగిన సీజేపీ నిరసనల్లో కూడా పాల్గొన్న హఫీజ్.. పాఠశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సామాజిక తనిఖీలో భాగస్వామి కావాలని అనుకున్నట్లు తెలిపారు. తాను చదువుకున్న కరిసుంద ప్రాథమిక విద్యాలయానికి వెళ్లి కొన్ని వీడియోలు తీసుకుని ఇంటికి తిరిగి వచ్చానని చెప్పారు. రాత్రి 8 గంటల సమయానికి కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి చుట్టుముట్టారని, తనపై కూడా దాడి చేయడంతో పాటు వృద్ధుడైన తన తండ్రిని కొట్టారని హఫీజ్ తెలిపారు. తన ఫోన్‌ను లాక్కుని, పాఠశాలకు




సంబంధించిన వీడియోలు, జంతర్ మంతర్‌లో తాను తీసిన వీడియోలను తొలగించాలని బలవంతం చేశారని చెప్పారు.

నా రక్తం మరిగిపోతోంది: దీప్కే

అబ్దుల్‌కు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అబ్దుల్‌కు మద్దతు తెలిపారు. అతడి తండ్రి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై మాట్లాడిన తర్వాత అబ్దుల్ ఆ పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లారని దీప్కే ఎక్స్‌లో చేసిన పోస్టులో తెలిపారు. అబ్దుల్, ఆయన కుటుంబంపై బీజేపీతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు దాడి చేసిన తర్వాత ఆయన తండ్రి హత్యకు గురయ్యారని దీప్కే ఆరోపించారు. "మెరుగైన పాఠశాలలు కావాలని డిమాండ్ చేసినందుకు ప్రజలను హత్య చేస్తున్నారంటే నా రక్తం మరిగిపోతోంది" అని దీప్కే పోస్టులో పేర్కొన్నారు. సీజేపీ బృందం పశ్చిమ బెంగాల్‌కు వెళ్లి అబ్దుల్, ఆయన కుటుంబంతో కలిసి న్యాయం కోసం పోరాడుతుందని దీప్కే తెలిపారు. బెదిరింపులు, భయపెట్టే ప్రయత్నాలు ఎదురైనా.. మెరుగైన ప్రభుత్వ పాఠశాలల కోసం తమ ప్రచారాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ ప్రాథమిక సదుపాయాల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్న 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని దీప్కే ప్రారంభించిన తర్వాత ఆయన ఈ పోస్టు చేశారు.

# తెలంగాణ చేనేత కార్మికులకు శుభవార్త

హైదరాబాద్,చేనేత, మరమగ్గాల రంగాలపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్న భద్రత పథకం కింద అర్హులైన ప్రతి కార్మికుడికి ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే ఐదు లక్షల రూపాయిల ఉచిత బీమా అందిస్తున్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ స్పష్టం చేసింది. చేనేత పనులతో పాటు డైయింగ్, డిజైనింగ్, వైండింగ్ వంటి అనుబంధ రంగాల కార్మికులు కూడా ఈ పథకానికి అర్హులుగా ఉన్నారు. కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఈ అరుదైన పథకం ద్వారా ఆకస్మిక మరణాలు సంభవించినప్పుడు కుటుంబ సభ్యులకు ఈ బీమా రక్షణ నేరుగా అందుతుంది.

ఈ నెల పద్దెనిమిదో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల పరిధిలోని అర్హులైన కార్మికులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడానికి ఈ నెల పద్దెనిమిదో తేదీ తుది గడువుగా నిర్ణయించడం జరిగింది. గడువు ముగిస్తే ఈ అద్భుతమైన అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది కాబట్టి త్వరపడాలి. సంబంధిత చేనేత జౌళి శాఖ కార్యాలయాలను సందర్శించి అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. గుర్తింపు కార్డులు ఇతర ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకుని వెంటనే దరఖాస్తులను పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు. సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనం



సాగిస్తున్న కుటుంబాలు అకస్మాత్తుగా పెద్ద దిక్కును కోల్పోతే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటాయి. అలాంటి క్లిష్ట సమయాల్లో ఈ ఉచిత బీమా పథకం ఆ కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా ప్రీమియం భరించి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అర్హత కలిగిన ప్రతి కార్మికుడు ఈ అవకాశాన్ని చేజార్చుకోకుండా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకొని భద్రత పొందాలి.

# విజయ్ తల్లిపై కామెంట్స్.. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిపై ఫిర్యాదు




చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, ఆయన తల్లిపై అవమానకర, పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌పై తమిళనాడు డీజీపీకి ఫిర్యాదు అందింది. డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని, సంబంధిత చట్టపరమైన నిబంధనల కింద వ్యాఖ్యలపై దర్యాప్తు చేయాలని, పరువునష్టం, బహిరంగ ప్రదేశంలో అనుచిత ప్రవర్తనకు సంబంధించి తగిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు పోలీసులను కోరారు.

శనివారం చెన్నైలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం కమలాలయంలో జరిగిన కార్యక్రమంలో నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలతో తలెత్తిన రాజకీయ వివాదం నేపథ్యంలో ఈ ఫిర్యాదు వచ్చింది. అసెంబ్లీలో డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి విజయ్ చేసిన "కుట్టి కథై" (చిన్న కథ) వ్యాఖ్యలపై నాగేంద్రన్ విమర్శలు చేశారు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన నాగేంద్రన్.. అసెంబ్లీలో విజయ్ పదేపదే "తండ్రి" గురించి ప్రస్తావించడాన్ని ఎగతాళి చేశారు. "మీ తండ్రి ఎక్కడ ఉన్నారో తెలుసుకోవాలనుకునేవారు అసెంబ్లీలో సమాధానం కోసం వెతకకుండా ఇంట్లో మీ అమ్మను అడగాలి" అని అన్నారు. విజయ్, ఆయన తల్లిపై బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన ఆడియో, వీడియో రికార్డులను పరిశీలించి, కేసు దర్యాప్తులో భాగంగా వాటిని స్వాధీనం చేసుకోవాలని కూడా పోలీసులను కోరారు. 2026 ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమి తర్వాత అసెంబ్లీలో విజయ్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మొదలైంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తండ్రి ఎక్కడ ఉన్నారనే అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ "కుట్టి కథై" చెప్పారు. ఇది కొళత్తూరులో డీఎంకే అధ్యక్షుడి ఓటమిని ఉద్దేశించిన హాస్యభరిత వ్యాఖ్యగా భావించారు. ఆ సమయంలో డీఎంకేతో పాటు పలు రాజకీయ పార్టీలు విజయ్ వ్యాఖ్యలను విమర్శించాయి. ముఖ్యమంత్రి చేసిన కామెంట్లపై స్పందిస్తూ మాజీ ముఖ్యమంత్రి.. తాను శాసనసభలో లేకపోయినా ప్రజల హృదయాల్లో ఉన్నానని అన్నారు. నాగేంద్రన్ తాజా వ్యాఖ్యలపై బీజేపీలోనూ, రాష్ట్ర ప్రభుత్వంలోనూ విమర్శలు వచ్చాయి. తమిళనాడు మంత్రి ఎ.రాజ్మోహన్ ఈ వ్యాఖ్యలను "అనాగరికమైనవి, అనుచితమైనవి"గా అభివర్ణించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలు ఎదురైనా రాజకీయాల్లో మర్యాద పాటించాలని విజయ్ తన సహచరులను ఎప్పటికప్పుడు కోరారని చెప్పారు. తమిళనాడు నేత కె.అన్నామలై కూడా నాగేంద్రన్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. అవి రాజకీయ మర్యాదకు ఉన్న హద్దులను దాటాయని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, రాజకీయ విభేదాలపై చర్చించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సమర్థించదగిన అంశాలని అన్నామలై చెప్పారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిది...

కొలిమిగుండ్ల , కొలిమిగుండ్ల మండలం గోరుమానుపల్లె గ్రామపంచాయతీ మజారా గ్రామమైన కొండమీద పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 1.14 మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహాయ సహకారాలతో మంజూరు చేయించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇవాళ బాధిత మహిళ లక్ష్మీదేవికి కొలిమిగుండ్ల మండల టిడిపి అధ్యక్షుడు మూలె రామేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.

# కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ...కవిత ఎమోషనల్ కామెంట్స్ !

హైదరాబాద్,తెలంగాణా రక్షణ సేన టీఆర్ ఎస్ అధ్యక్షురాలు అయిన కల్వకుంట్ల కవిత ఒక ప్రముఖ చానల్ ఇంటర్వ్యూలో కీలక సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ బీఆర్ఎస్ లో కలిసే ప్రసక్తి లేదని అన్నారు. తనను అకారణంగా సస్పెండ్ చేసి బయటకు పంపించిన పార్టీలోకి తిరిగి వెళ్ళడం అన్నది జరిగే పని కాదని ఆమె అన్నారు. ఇది తాను నూటికి నూరు శాతం చెబుతున్న మాట అని అన్నారు. తండ్రిగా కేసీఆర్ అంటే తనకు ఎపుడూ గౌరవం అన్నారు. ఆయనను తాను కుమర్తెగా ప్రేమిస్తాను అని అదే సమయంలో రాజకీయంగా బీఆర్ఎస్ తో విభేదిస్తాను అని స్పష్టం చేశారు. తనకు జీవిత కాలానికి సరిపడా బాధను మిగిల్చారు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో నేను ఒక్కరే :

ఒక తండ్రిని ఎదిరించి రాజకీయ పార్టీని పెట్టిన చరిత్ర బహుశా దేశంలో తన ఒక్కరి విషయంలోనే జరిగి ఉండొచ్చు అని ఆమె అన్నారు. దానికి కారణాలు అనేకం ఉన్నాయని అన్నారు. తెలంగాణా కోసం తాను జాగృతి సంస్థ ద్వారా ఎన్నో ఉద్యమాలు చేశాను అని బీఆర్ఎస్ లో ఒక అగ్ర నాయకురాలిగా ఉన్నాను అని అలాంటి తనను ఏడాదిగా పార్టీలో ఎడం పెంచి చివరికి షోకాజ్ నోటీసు అయినా ఇవ్వకుండా సడెన్ గా సస్పెండ్ చేయడం బాధ కలిగించింది అన్నారు. ఏ పార్టీ కోసం అయితే తాను ఆరు నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నానో అదే పార్టీ తనకు అండగా నిలబడలేకపోయింది అన్నారు. తనను సస్పెండ్ చేసినపుడు బీఆర్ఎస్ అధినేతగా కేసీఆర్ కనీసంగా స్పందించలేదని అన్నారు.

తప్పకుండా గెలుస్తాం :

తెలంగాణాలో తమ పార్టీ తప్పకుండా గెలిచి తీరుతుందని కవిత స్పష్టం చేసారు. తాను సామాజిక తెలంగాణా నినాదంతో ముందుకు సాగుతున్నాను అన్నారు. బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు తన డిమాండ్ అన్నారు. బీసీలకు మహిళలకు సాధికారిత తమ పార్టీ లక్ష్యాలు అని ఆమె చెప్పారు. తెలంగాణా సమాజంలో బీసీలు అంతా తమ పార్టీ వైపు ఆశగా చూస్తున్నారు అని అన్నారు. అందువల్ల తాను గెలిచి చూపిస్తాను అన్నారు. ఈ రోజున కవిత ఒంటరిగా కనిపిస్తున్నా తమ పార్టీ సైన్యం వెనకాల చాలానే తయారు అవుతోందని చెప్పారు. 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జిలు నియమించామని తొమ్మిది పార్లమెంట్ సీట్లలో బాధ్యులను పార్టీ తరఫున నియమించామని ఆమె చెప్పారు. వంద రోజుల పార్టీ తమదని అయినా బలంగా రాజకీయ క్షేత్రంలో నిలిచేందుకు



ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.


బీజేపీ అవుట్ :

తెలంగాణాలో తమ పార్టీ ఎదుదుగల వల్ల బీజేపీకే అతి పెద్ద నష్టం జరుగుతుందని అన్నారు. ఆ పార్టీ సామాజిక తెలంగాణాకు వ్యతిరేకమని కవిత విమర్శించారు. ఇక తన పార్టీ వల్ల బీఆర్ఎస్ కి నష్టమా కాంగ్రెస్ కి నష్టమా అన్నది కాలం తేల్చాల్సినదే అన్నారు. తాము మాత్రం ఫోర్ ఫ్రంట్ లో నిలిచేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. అదే సమయంలో తెలంగాణాలో కాంగ్రెస్ బీఆర్ఎస్ బీజేపీ అన్న తేడా లేకుండా మూడు పార్టీల మీద బలమైన పోరాటం చేస్తామని కవిత చెప్పారు.

తెలుగు గడ్డ మీదనే :

ఇదే సందర్భంలో కవిత మరో మాట అన్నారు. తెలుగు గడ్డ మీదనే ఆడ బిడ్డలకు అన్యాయం జరుగుతోంది అని చెప్పారు. జాతీయ స్థాయిలో రాహుల్ ప్రియాంక సంఖ్యతగా ఉన్నారని యాంకర్ అన్న మాటలకు ఆమె స్పందిస్తూ ఏపీలో జగన్ షర్మిల అయినా ఇక్కడ తాను కేటీఆర్ అయినా సమస్య వచ్చినది ఆడ బిడ్డలకే అని అన్నారు. తెలుగు నీరులో ఏదైనా లోపం ఉందేమో అని ఆమె సరదాగా వ్యాఖ్యానించారు. ఇక ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ రాసిన ఒక డైలాగ్ ని యాంకర్ స్క్రీన్ మీద ప్రజెంట్ చేసి వినిపించారు. శత్రువులు ఎక్కడో ఉండరని కూతుళ్ళు చెల్లెళ్ళ రూపంలో తిరుగుతుంటారని అన్న దానికి కవిత నవ్వుతూనే దీనిని తమకు అనుకూలంగా మార్చుకుంటామని అన్నారు. శత్రువులు కొడుకులు అన్నల రూపంలో ఉంటారని కౌంటర్ వేశారు. దీని ద్వారా కేటీఆర్ మీదనే ఆమె కామెంట్స్ చేశారని అంటున్నారు.

# స్థానికంలో బీసీ రిజర్వేషన్లు లేనట్లే..?



అమరావతి,త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు. ఇక రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లు పెంచాలని చూసినా సుప్రీం కోర్టు తీర్పు కారణంగా బ్రేక్ పడింది. దీంతో అక్కడ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించారని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులతో రిజర్వేషన్లు పెంచుకోవాలని చూసినా, అందుబాటులో ఉన్న కులాల లెక్కలతో కేవలం 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచేందుకే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానికంలో బీసీ రిజర్వేషన్లపై ఆలోచన మార్చుకున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమయ్యేలా లేదని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మోడల్ ను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేయకపోయినా కూటమిలోని మూడు పార్టీలు కలిపి 34 శాతం స్థానాలలో బీసీలను పోటీపెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. శనివారం కూటమి పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని చెబుతున్నారు. దీంతో స్థానికంలో బీసీ రిజర్వేషన్ పెరిగే పరిస్థితి కనిపించడం లేదన్న విషయం స్పష్టం అవుతోందని అంటున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140